చిక్కని చీకటి గుడిసెపై కప్పునించి అలికిన యిల్లంతా అలముకుంది. బయట ఆకాశంమీద చంద్రుడు లేడు. నక్షత్రాల్లేవు. చీకట్లో ఏముందో తెలీడంలేదు. గాలిమాత్రం కూలీపైన విరుచుకు పడే కామందులా వేగంగా వీస్తోంది.

గుడిసెలోంచి ఉండుండీ మూలుగువినిపిస్తోంది. ఆ గుడిసెలో ఉండే మగమనిషి తను తాళికట్టిన స్త్రీని పదినిమిషాల్రితం చావబాది వెళిపోయినసంగతి ఎవరికీ అవసరమైన విషయంకాదు. అయిదేళ్ల పసివాడు—ఆకలితో పడున్నవాడు—ఆ మనుషులిద్దరికీ పుట్టినవాడు మాత్రం ఆ దృశ్యంచూచి తల్లడిల్లి పోయాడు తాళుకోలేక పోయాడు. తండ్రిని అడ్డుకోబోయి తల్లితోపాటు,

తనూ చెంపదెబ్బలు తిన్నాడు. ఆతగాడు తాగిన మైకంలో వాళ్ళిద్దరినీ వాయించేసి, అ తలేదో ముంచుకు పోతున్నట్టు చిరిగిన పంచెను పైకి దోపుకుని చీకట్లో కలిసి పోయాడు. కన్నకడుపు గనుక, పసివాడి ఒళ్లు తట్లు తేలిందని తల్లడిల్లిపోయి, కొడుకును ఒళ్ళోకి తీసుకుని ఆమె కుమిలిపోయింది. పసివాడు పాపం! వెక్కి వెక్కి ఏడ్చి నిద్రలోకి జారుకున్నాడు. గోని సంచీమీద చిరిగిన ముతక చీరొకటి పరిచి, వాడిని పండుకోబెట్టి, ఆ చీరనే వాడి ఒంటిని కప్పి, పక్కనే కూలబడి పోయింది. చెదిరిన జుత్తు ముఖంమీద పడి, కన్నీళ్లతో తడిసి బుగ్గలకంటు కుంది. భుజం మీంచి చీరకొంగు జారి నేలకంటుకుంది. తాగుబోతు భార్యగా సాగిన గతకాలం మెదడు అరల్లో గిరగిరాలు తిరుగుతూ ఆమె దురదృష్టాన్ని పదే పదే జ్ఞాపకం చేస్తూండగా, ఆమె మరేం చెయ్యడానికి మనసురాక బాధతో మరీ మరీ ఏడిచి తనూ కొడుకు పక్కను చోటు చేసుకుంది.

గుడిసెలో చీకటుంది. ఆమె మనసులో చీకటుంది. భవిష్యత్తంతా ఆమెకు చీకటిగనే ఉంది.

కుర్రవాడు ఉండుండి మూలుగుతున్నాడు. వాడు మూలిగినప్పుడల్లా ఆమె నిద్రలో ఉలికులికిపడుతోంది.

గాలి బయట వేగంగా వీచి వీచి, ఒక్క పెట్టున కుండపోతగా వర్షం ప్రారంభమైంది. తాటాకులు సరి లేని గుడిసె పైన కుంభవృష్టి రాళ్లవానగా ఉంది. ఆకాశంలో మెరుపులున్నాయి. ఉరుములున్నాయి. ఎక్కడెక్కడో పిడుగొక్కటి విరుచుకు పడింది. చెవ్వే కూలిందో—చే మేరలిందో—చిన్నవాడు దడుసుగుని గావరుమన్నాడు పక్కలో తల్లి భయపడి లేచి కూచుంది ఉడబడుతూ కుర్రవాడిని గుండెల కదుముకుంది. ఓపికలేని స్వరంతో ఓదారుస్తోంది. వీపుమీద చేయిరాస్తూ సముదాయిస్తోంది. పసివాడు మళ్ళీ పక్కమీదకి చేరడు. కన్నతల్లి కౌగిట్లో కన్ను మూశాడు. బయట వర్షం ఏకబిగిగా ఉంది.

పిల్లవాడి తల్లికి కన్ను మూతపడలేదు ఒళ్లంతా దెబ్బలతో పచ్చిపులుస్తోంది. కొత్తకాదుగాని; కోరి చేసుకున్న వాడు ఎందుకూ కొరగానివాడై సర్వ వేళలా ఎరుపెక్కిన కళ్లతో ఎరిగిన వాళ్లందరిలో తలవంపులుతెస్తూ తిరుగుతూండడమేగాక ఇప్పుడిప్పుడు దొంగతనాలకు చేతిని మప్పుతున్నాడని ఆమెకు తగని బాధగా ఉంది. జరిగిన గొడవంతా అందికే జరిగింది.

'నువ్వేం పనిపాటలు సేయొద్దు. అబ్బిగాడిని పెట్టుకుని కూకో! నాను పని సేసుకొత్తా. ఆయిగా ఉందాం' అంది ఆదిలక్ష్మి.

అప్పటికే స్వర్గానికి అల్లంత దూరంలోఉన్న మల్లన్న ఊఁ అనలేదు. ఆఁ అనలేదు.

'దొంగతనాలు మానెయ్యి. వనుంటే పరవాణ్ణం తిందాం. లేనిరోజుల్లో వరి గెంజి తాగుదాం. దొరికితే కీళ్లిరిసి జైల్లో తోసేత్తారు. నీకోసం ఏడుత్తా కూకోలేను.'

మల్లన్నకి మండుకొచ్చింది.

'ఏంటే కూత్తన్నావ్' అని అరిచాడు.

'మొగుడొచ్చాడని కూడెట్టడం లేదు గాని ఏంటే తెగ సతుకుతున్నావ్' అంటూ లేచాడు.

'దొంగతనానికెల్తాను. రంగసానిదగ్గరికెల్తాను. నాయిట్టవే! మువ్వెవతైవే నాకు సెప్పడానికి. దొంగలంజా!' అంటూ జుట్టు పట్టుకున్నాడు.

పట్టుకోవడమేవిటి—పదునుగా పడడమేవిటి! అడ్డొచ్చినవాడు అబ్బిగాడంటూ చూడకుండానే అదే దరువు వేశాడు.

ఆదిలక్ష్మికి మల్లన్నంటే ఎప్పుడూ కోపంలేదు. మనువాడినవాడు తిట్టనీ మొట్టనీ—మనసిచ్చి, మమత నిలుపుకుని, బొందెలో ప్రాణం వున్నంతకాలం మాట కెదురు చెప్పకుండా ఉండాలన్నదే ఆదిలక్ష్మి నియమం. కాని, కట్టుకున్నవాడు కానిపనికి తలపెట్టితే మనసు సరిపెట్టుకోలేకపోయింది. అంత మంచివాడు, అధర్మమంటే మండిపడే వాడు, తల నరికినా కల్లమాట పలకనివాడు దరిద్రంతో ఎలా మారిపోయాడని ఆదిలక్ష్మి ఆశ్చర్యపోయింది అక్కడెక్కడో ఆయినవారింటిలో అర్ధరాత్రివేళ అంకినదంతా చిక్కించుకుని చీకట్లో జారుకునేవేళ పట్టుబడిపోయిన వతాభిగాడికి రెండేళ్ళు జైలు శిక్ష పడిందని పల్లమ్మ చెప్పినప్పుడు ఆదిలక్ష్మి తనవాడికోసం తగని భయం పెట్టుకుంది. ఆ భయంతోనే నియమం తప్పి ఎదురుమాట చెప్పింది. రాత్రంతా కొంచెం హెచ్చుతగ్గుగా వానపడుతూనే ఉంది. ఆషాఢంలో అది అబ్బురం కాదు. ఆకులు అంతంతమాత్రంగా ఉన్న గుడిసెలోంచి వానదేవుడు మనసుపడి పట్టిల్లంతా నరసాపురంరేవు చేయడంకూడా ఆశ్చర్యంకాదు. నిద్రలో మునిగిన చిన్నవాడూ, చెంతనే చింతలో మునిగిన ముద్దరాలూ కొంచెం మెరకగా ఉన్న మూలను చేరుకుని చలికి వణుకుతూ ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎరుపెక్కిన కళ్లతో ఎదురుచూస్తూ ఆ రాత్రి గడిపారు

ఎదురు చూడకపోయినా తెల్లవారక తప్పదు. ఉదయానికి పసివాడికి మాగన్నుగా నిద్రపట్టింది. ఆదిలక్ష్మి ఆవలిస్తూ లేచి తడక తీసుకుని ఈవలకొచ్చింది. సన్నటి చినుకులు పదదాగా రాల్తున్నాయి. వాకిట్లో పాతిన వంగ మొక్కలన్నీ పీకలోతు నీళ్లల్లో మునిగి ఉన్నాయి. నిద్రగన్నేరుకొమ్మలు కొన్ని గాలికి విరిగొచ్చి వాకిలంతా కమ్ముకున్నాయి. పక్కనున్న సన్నకాలవలో నీరు ఎర్రగా పరుగెడుతోంది. గుడిసె గుమ్మంలో ముంగాళ్లమీద కూచుని రాత్రి కురిసిన వర్షం ముద్రల్ని చూస్తోంది ఆదిలక్ష్మి. ఎప్పుడు లేచి వొచ్చాడో కుర్రవాడొచ్చి మెదలకుండా కూచున్నాడు.

'దేవుడా! నాబతుకు ఇలా సేసావెందుకు?' అనుకుంది ఆదిలక్ష్మి. రాత్రి జరిగిందందా జ్ఞాపకం వొచ్చి పదేపదే అదేమాట అనుకుంది.

'నానేం తప్పు సెయ్యలేదు. మరి నా బతుకెందుకిలా కాలిపోయింది. దేవుడా! ఆడిబుద్ధి సరిసెయ్యలేవా!?' అని కూడా అనుకుంది.

తనలో తను అనుకుంటున్నట్టు 'దేవుడా! ఆడిబుద్ధి సరిసెయ్యలేవా!' అని పైకే అనేసింది.

మెదలకుండా కూచున్న పిల్లవాడు ఆమాట విన్నాడు. వాడికంతా అర్థమై

పోయింది. రాత్రి జరిగింది వాడికి జ్ఞాపకం వొచ్చింది. బయట పరుగెడుతున్న వానసీట్లోకి చూశాడు. దిగాలుగా కూచున్న అమ్మనిచూసి, అడగదలచుకున్న ప్రశ్నని మనసులో అట్టడుగున పడవేశాడు.

అప్పటికి ఆదిలక్ష్మి వాడిని చూసింది.

'అబ్బిగా! లెగిసావురా! మాబాబే!' అంటూ వాడిని ముద్దు పెట్టుకుంది.

'నువ్వు మీ బాబులాగా తాగొద్దు. దొంగతనాలు సేయొద్దు. దొరబాబులాగా బతకాలిరా! బాగా సదుంకోవాలి. సంవచ్చరానికి రెండు కళాసులు సదుంకోవాలి. కలకటేరు వవ్వాలిరా నువ్వు—కలకటేరు వవ్వాలి.' అంది ఆదిలక్ష్మి గుండెల్లో కొడుకుమీద గూడు కట్టుకున్న ఆశవంతా విప్పి చెప్పతూ.

అబ్బిగాడదేం వినలేదు. వాడు మళ్ళీ అమ్మ ముఖంలోకి చూసి, ఏదో అడగబోయాడు.

'సందకాడ కూడెడదావంటే నిద్దరోయావు. ఉప్పుడు తింటావా?' అని అడిగింది ఆదిలక్ష్మి.

తను నిద్రపోయానని అమ్మ అబద్ధమెందుకు ఆడుతోందో అబ్బిగాడికి అర్థం

దేవుడు

కాలేదు.

'ఆకలేత్తుందే!' అన్నాడు.

ఆదిలక్ష్మి వాడిముఖం కడిగి మూకిట్లో యింత అన్నం పడేసి, అంత గంజిపోసి, నంజుకోడానికో ఉల్లిపాయ ముక్కిచ్చి కొడుకును తినబెట్టింది. తను ముఖం కడుక్కుందిగాని ముద్ద తినబుద్ధి కాలేదు.

'ఆడొస్తే యిద్దరం కూకొని తినొచ్చులే' అనుకుంది.

మెత్తగాఉన్న అన్నంతిని, గంజితాగి, చేయి కడుక్కుని, ఉల్లితేనువులు తేన్చి, అబ్బిగాడు అమ్మపక్కని కూచున్నాడు. ఆమె ముఖంలోకి చూసి ఏదో అడగాలనుకున్నాడు గాని అమ్మ చెబుతుందో చెప్పదో అన్న అనుమానంతో మళ్ళీ తల దించేసుకున్నాడు.

ఆదిలక్ష్మికి దేవుడిమీద కొండంత నమ్మకం. అన్నవరం దేవుడిని చూడాలని ఆమె కెప్పటినుంచో కోరిక. పెళ్ళైన కొత్తలో మల్లన్న మనసు మెత్తగా ఉన్నప్పుడల్లా అడిగి అడిగి ఆదిలక్ష్మి విసిగెత్తిపోయి ఇంక అడగడం మానుకుంది. అందికే ఆమెకోరిక కోరికగానే

ఉండిపోయింది.

'నాదేవుడు సరిగా సూత్తే అంతే సాలు! అన్నవరవేం ఎల్లాలని ఎక్కడుంది?' అనుకుని సరిపెట్టుకుంది.

ఏదో గొప్ప ప్రమాదం తనవాడికి ముంచుకొస్తుందని అనుమానం తగిలినప్పటినించి ఆమె మాటి మాటికి దేవుడిని తలుచుకుని, తన బతుకెందుకిలా చేశావనుకుంటూ ఉండడం ఆదిలక్ష్మికి అలవాటై పోయింది.

ఈసారి కుర్రవాడు తన ప్రశ్ననిక దాచుకోలేక పోయాడు.

'అమ్మా! దేవుడెక్కడుంటాడే?' అని అడిగేశాడు.

ఆదిలక్ష్మి అబ్బిగాడి కళ్ళల్లోకి చూసింది.

'అమ్మా! సెప్పే! దేవుడెక్కడుంటాడే' అని అడిగాడు.

'ఎక్కడుంటాడని చెప్పాలి! 'కలడు కలండనెడు వాడో కలడో లేడో' అని వేదాంతశాస్త్ర మథనం సల్పిన మహామహులకే అనుమానం కలిగించినవాడు ఫలానాచోట పతితులకోసం, ఆర్తులకోసం అభయహస్తంతో కొలువు తీరి ఉన్నాడని అసలు అ ఆలైనా చదవని ఆదిలక్ష్మి ఎలా చెప్ప గలుగుతుంది!

పసివాడి ప్రశ్నకి సమాధానం చెప్పలేదుగాని ఆదిలక్ష్మి వాడిని మరో ప్రశ్న అడిగింది—

'ఎందుకురా అబ్బిగా!' అని.

వాడదేం చెప్పలేదు.

'సెప్పే ఎక్కడుంటాడో.'

'ఎల్తావా?'

'ఎల్లాలి'

'ఎందుకురా?'

'పనుందే. ఒకసారి ఎల్లాలి.' అన్నాడు అబ్బిగాడు విసుగ్గా.

ఆదిలక్ష్మి ఆశ్చర్యపోయింది. దేవుడితో వీడికేం పని! పనేవిటని ప్రశ్నిస్తే చిన్నవాడు చెప్పడు.

'ఎక్కడున్నాడో సెప్తానా' అని అడిగింది ఆదిలక్ష్మి.

'సెప్పు—తొరగా సెప్పు.'

'గుళ్ళో ఉన్నాడు'

'గుడంటే—?'

'మనూరి సెరువు లేదా! అక్కడ



రెండు గుళ్ళలేవా! అక్కడ—'అబ్బాయి అక్కే తలూపాడు. ఒకసారి కళ్ళు మూసు మూసుకుని 'దేవుడా!' అనుకున్నాడు. మళ్ళీ ఏం జ్ఞాపకం వొచ్చిందో—'అమ్మా! నువ్వు కూడు తినే!' అన్నాడు.

వాడి ఆలోచనేమిటో ఆదిలక్ష్మికి అంతుపట్టలేదు. అడిగితే ఆరు నూరైనా అసలుసంగతి అంత సులభంగా చెప్పడు.

'దేవుడు అందరికీ కనిపించడు' అంది ఆదిలక్ష్మి.

'ఎవరికి కనిపిస్తాడు?'

'మంచోళ్ళకి మాత్రం కనిపిస్తాడు.'

'నాను మంచోణ్ణేనా?' అనడిగాడు అబ్బాయి.

'వో నువ్వు మా బంగారం'

తనకి దేవుడు తప్పక కనిపిస్తాడని అబ్బిగాడు మురిసిపోయాడు.

'మరిసిపో నాన్నా! మన అమ్మగారి ఇల్లాల ఎదురొంగని రమ్మన్నారు. మువ్వొక్కడికే ఎల్లకు. బాబొస్తే కూడెట్టుకు తినమను' అనిచెప్పి ఆదిలక్ష్మి గుడిసెతలుపు దగ్గిరగా జరిపి ఊళ్ళోకి బయలుదేరింది.

అబ్బిగాడో మూలను జేరగిలబడి, ఏవి టేవిటో ఆలోచిస్తూ కూచున్నాడు.

దేవుడు

దేవుడు మంచివాళ్ళకి మాత్రమే కని పిస్తాడని అమ్మ చెప్పింది. ఒకసారి దేవుణ్ణి చూడాలి, అందరికీ మంచి వాడైన దేవుడు తన ప్రార్థన తప్పక వింటాడు.

నిన్నరాత్రి నిండుచీకట్లో కట్టుకొన్న దాన్ని కసిరికొట్టి కన్నబిడ్డని బెదిరగొట్టి చేతికొచ్చినట్టల్లా చావబాది వెళిపోయిన వాడు ఉస్సురస్సు రంటూ తిరిగొచ్చాడు.

'అమ్మేదిరా!' అనడిగాడు కొడుకుని.

అబ్బిగాడు వొణుకుతూ చెప్పాడు.

మల్లన్న కుండ వెతుక్కున్నాడు.

కంచుగిన్నెలో చద్ది పెట్టుకున్నాడు.

కూడంతా కడుపు కెక్కింది, చుట్ట వెలిగించుకున్నాడు.

ఇంకా చినుకులు రాల్తున్న ఆకాశం వొంక చూస్తూ గుమ్మంలో కూచున్నాడు.

ఆకాశంలో సూర్యదేముడున్నాడో అగుపించడం లేదు.

బుజ్జిగాడు మెల్లగా గుడిసెలోంచి బయటపడ్డాడు.

చెరువు దగ్గరగా చింత తోపుంది. చెంతనే రావి వేప దాంపత్యం నెరపు తున్నాయి. అటువైపు ఆలయాలున్నాయి. ఆలయాలకు పక్కనే ఆచార్యుల యిళ్ళున్నాయి.

అబ్బిగాడు శివాలయ ప్రాంగణందాటి లోపలకు వెళ్ళాడు. అర్చకులవారు ఆరోజు స్వామివారికి దీపపెట్టారో లేదో తెలీదు గాని తలుపులు మూసి ఉన్నాయి. అబ్బిగాడెంత ఎదురు చూసినా అసలు వారెవరూ అటు తొంగిచూడనే లేదు. తలుపులు మూసిన గుడిలోపల ప్రపంచాధినేత వస్త్రం ధరించే ఉన్నాడో—సామ్రాట్ న పరదుకొన్న పడతితో సరాచికాలే ఆడుతున్నాడో అబ్బిగాడికేం తెలుసు! ఎదురుచూచి చూచి ఎంతకూ ఎవ్వరూ మూసిన తలుపులు తెరవకపోతే, వాడు నిరాశతో వెనక్కు తిరిగాడు. అప్పుడు వైష్ణవాలయం తలుపులు తెరవడానికి ఆచార్యులవారు పట్టుపంచెలో పచ్చనామాలతో వొచ్చారు.

'ఎవర్రా?' అని అరిచారాయన.

భయపడుతూ భయపడుతూ అబ్బిగాడు నాలుగడుగులు ముందుకు వేశాడు.

'ఎందుకురా! ఇటెందుకు వొస్తున్నావురా! ఫో! బయటికి ఫో!' అని గావు కేకలు వేయడం ప్రారంభించాడాయన.

దిక్కు చచ్చిపోయి, వెళ్ళిపోడానికి మనసొప్పక, కనుపించని కరుణామయునికి అక్కడే నిలబడి చేతులు జోడించాడు అబ్బిగాడు. వాడెరిగినంతలో దేవుడు మంచివాడే! అందరికీ దేవుడు మేలు చేస్తాడు.

'మా బాబుకు మంచి బుద్ధియ్యి దేవుడా! ఆడు మంచోడయితే సాలు. మా అమ్మని కొట్టకండా ఉంటే సాలు. ఇంకేం వొద్దు. మా బాబును బాగుసెయ్యి దేవుడా!'

'ఇంకా నిలబడ్డావేంరా గాడిదా!' అని అరిచారు ఆచార్యులవారు.

అబ్బిగాడు తొంగిచూశాడు గాని గుడిలో అలముకున్న చీకట్లలో దేవుడు కనిపించలేదు. మళ్ళీమళ్ళీ చూశాడు.

'మంచోళ్ళకి మాత్రం కనిపిస్తాడు' అని తల్లి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి అబ్బిగాడికి.

'నాను మంచోణ్ణి కాదేమో!' అనుకున్నాడు.

'నాను మంచోణ్ణి కాపోతే పోసిలే,



దేవుడు మంచోడు. బాబుని బాగుసెయ్యి అంతేసాలు. మా బాబు మంచోడయితే నాను మంచోణ్ణి కాపోయినా ఫర్లేదు. దేవుడా! మా బాబును బాగుసెయ్యి! నీకు కోటిదండాలు' అని అనేకసార్లు అనుకున్నాడు అబ్బిగాడు. చెంపలేసుకున్నాడు. చేతులు జోడించాడు.

అయినా వాడికి సంతృప్తి కలగలేదు. దేవుడెలా ఉంటాడో కళ్లారా చూడాలి. అయినా చెట్టంతమనిషి గుడిగుమ్మంలో నిలబడి 'ఛీ, ఛీ పొమ్మ'ని చీదరించుకుంటూంటే చిన్నవాడు భయపడ్డాడు. దేవుడు మంచివాడనుకున్నవాడు దేవుణ్ణి మంచి చేసుకునేవాణ్ణి దుర్మార్గుడనుకున్నాడు. అందికే ప్రహరీదాటి, లాగూ పైకి లాక్కుంటూ ఇవతలికి వొచ్చాడు.

రావిచెట్టు తిన్నె మీద రాగిజుట్టుతో, రంగు మారిన తెల్లపంచెతో, పెరిగిన గడ్డంతో, పెదవులపై నవ్వుతో ఓ మనిషి కనిపించాడు. చేయెత్తి పిలిచాడు. దగ్గరగా కూర్చోబెట్టుకున్నాడు.

'నాయనా! నువ్వు గుళ్లో కెళ్లావా?' అని అడిగాడు ముసలాయన. అవునని తలూపాడు అబ్బిగాడు.

'దేవుడు బావున్నాడా!' అని అడిగాడు ముసలాయన ముసిముసిగా నవ్వుతూ.

అబ్బిగాడు అమాయకంగా చూస్తూ 'కన్పడలేదు' అన్నాడు. ముసలాడీసారి బిగ్గరగా నవ్వేశాడు.

'దేవుడు కన్పించలేదా! అసలు గుళ్లో ఉన్నాడో—దళ్లో ఉన్నాడో! అయినా పిచ్చోడా! దేవుడు గుళ్లో ఎక్కడున్నాడురా!'

గడ్డం తాత మాటలు వింటే గాభరా ఎత్తింది అబ్బిగాడికి. తిన్నెమీంచి కిందికురికి, మిడుకూ మిడుకూ చూస్తూ నిలబడ్డాడు.

'ఈ గుళ్లు కట్టించింది నేను. ఈ చెరువు తవ్వించింది నేను. కాని—ఒరే నాయనా! ఇవేళ నన్ను గుళ్లోకి రానీయడం లేదురా! నేను చెడిపోయానంట! తాగితే మనుష్యులెవరైనా చెడిపోతారా చెప్పరా! ఆడవాళ్లని తాకితే మనుష్యులెవరైనా చెడిపోతారా చెప్పరా! ఆస్తంతా పోయింది గనక నేను చెడిపోయాను. చేతిలో చిల్లిగవ్వ లేదు గనక చెడిపోయాను. ఎవరి







కొంపలూ కూల్చలేదు గనక చెడిపోయాను: తడిగుడ్డతో గొంతులు కొయ్యలేదు గనుక చెడిపోయాను. నేను చెడిపోయానని చెప్పి వీళ్ళంతా నన్ను గుళ్ళోకి రాకుండా తరిమేశార్రా అబ్బాయ్! ఒరే! గుడి కట్టించిన నాకే దేవుడు కన్పించడం లేదు. నీ కెక్కడ కన్పిస్తాడురా! వెళ్ళు వెళ్ళు అమాయకుడా! నీకు దేవుడెందుకురా! నాకు దేవుడెందుకురా! దేవుడి కివ్వడానికి మనదగ్గరేం వుంది!'

పిల్లవాడు బెదురుకున్నాడు. మరి నిలబడితే ముసలాడు కొడతాడని భయపడి వెనక్కు తిరిగాడు.

'మాట మాట' అన్నాడు ముసలాడు.

పిల్లవాడు వెనక్కు తిరిగి చూశాడు.

'దేవుడు లేడురా! మనుషులకి భయపడి స్వర్గానికి వెళ్ళిపోయాడు. మనుషులు మంచివాళ్ళు కానప్పుడు దేవుడు గుళ్ళో ఉండడు. ఈగుళ్ళూ గోపురాలూ దేవుడు కోసం కాదు. మనుష్యుల కోసమే'

అబ్బిగాడు గబగబా అడుగులు వేశాడు. వెనకనించి ముసలాడి మాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

'అసలు దేవుడేలేడు ఉంటే—నే కట్టించిన గుళ్ళోనే ఉండును. నాతో మాట్లాడును. ఒరే అబ్బాయ్—దేవుడసలు లేడురా! భూమ్మీదా లేడు. పైనా లేడు...'

ఇదంతా అయిదేళ్ళ వాడికేం అర్థమౌతుంది. గుళ్ళో దేవుడున్నాడని అమ్మ చెప్పింది. 'దేవుడా! ఆడిబుద్ధి సరిసెయ్యలేవా!' అని అమ్మ నాలుగైదుసార్లు అనుకుంటే దేవుడు తన తండ్రి బుద్ధిని సరిచెయ్యగలడని వాడనుకున్నాడు. అందికే గుడికి వొచ్చాడు. ముసలాడు చెప్పిన 'దేవుడు లేడ'న్న మాట అతనిచెవిలో మారుమోగుతోంది.

వర్షం మళ్ళీ జోరుగా అందుకుంది. వానలో తడుస్తూనే అబ్బిగాడు గుడిసెకు జేరుకున్నాడు. గుమ్మంలో బాబులేడు. తడక జేరవేసుంది. మెల్లగా దాన్ని తోసుకుని లోపలకు వెళ్ళాడు.

గుడిసెలో ఘోరదృశ్యం కుర్రవాడి గుండెల్ని పిండివేసింది.

నట్టింట తల్లి పడుంది.

'అమ్మా!' అని పిలిచాడు కుర్రవాడు ఆ అమ్మ లేవలేదు.

'అమ్మా!' అని అరిచాడు అబ్బిగాడు. ఆ కట్టెకు ప్రాణంలేదని అబ్బిగాడికి తెలీదు.

చిత్తుగా తాగిన మైకంలో చేసుకున్న దాన్ని అయిదు రూపాయలకోసం మల్లన్న పీకపిసికి చంపాడని ఆ కుర్రవాడికేం తెలుసు!!??

దేవుడు మంచివాడు.

పెద్ద వయసువాడైనా పెద్ద మనసున్న వాడు.

ఆపదల్లో చిక్కుకున్న వాళ్ళందరినీ ఆదుకోవడం కోసమే గుళ్ళు కట్టించుకున్నాడు.

అయినా, వట్టిచేతులతో దర్శనం చేసుకున్నవాళ్ళ కతగడేం చేయలేడు.

దేవుడు మంచివాడు. మల్లన్నవంటి మనుష్యులకు పాపం! ఆయువిస్తాడు. మనసిచ్చి, మమత నిలుపుకుని, ఎన్ని కష్టాలనైనా భరించే ఆదిలక్ష్మివంటి ఆడబడుచులను మాత్రం ఆయనే రక్షించలేడు.

అయిదేళ్ళవాడు అబ్బిగాడు ఇవన్నీ తెలీనివాడు. దేవుడు తన అబ్బను సరిచేస్తాడని నమ్మాడు. కడకు దేవుడేం చేయగలిగాడు!!

అబ్బిగాడు తల్లిశవంమీద పడి భోరుమన్నాడు.

కట్టుకున్నవాడు తన పీక పిసుకుతున్నపుడు ఆదిలక్ష్మి 'దేవుడా!' అని అరిచే ఉంటుంది.

తను నమ్ముకున్న దేవుడే కనికరం వహించనప్పుడు కనిపించని దేవుడేం చేయగలడు?

అబ్బిగాడు నిజం తెలుసుకుంటాడు. అజ్ఞానం చేతిలో మంచితనం చచ్చిపోయిందని తెలుసుకుంటాడు, వాడు పెద్దయ్యాక.

'దేవుడా!' అనడు. గుడివంక చూడడు: అప్పటికి గుడి కట్టించిన పిచ్చి ముసలాడు తెల్లగడ్డంతో బతికుంటే అతనితో— 'అవును. దేవుడు లేడు' అంటాడు. ●